

కథా కౌముది


# సగం స్పృహ

విహారి



పిడపర్తి వెంకటరమణశర్మగారి జ్ఞాపకార్థం
కౌముది నిర్వహించిన కథల పోటీ (2023)లో
బహుమతి పొందిన కథ

**వీడియో కాల్ – హైదరాబాద్‌నుంచీ**. అమ్మా నాన్నా జాయింట్ సెషన్. సాగుతోంది.

"నీ వాలకం  బాగాలేదు నాన్నా. వీడియోలోనే ఇట్టా కనిపిస్తున్నావ్. విడిగా ఎంత చిక్కిపోయావో" తల్లి మనసు.

నవ్వొచ్చింది. నవ్వు నానావిధాలు అని ఈ మధ్య భారతంలో ఏకంగా నవ్వుల్ని పెద్ద పట్టిక చేసేశారు. నా నవ్వు నేమంటారో! పెదవి దాటని నవ్వు. 'పేలవంగా నవ్వాడు ' అంటారేమో రచయితలు.

నాన్న మౌనంగా, నిశితంగా పరీక్ష చేస్తున్నాడు. అమ్మ మాటల్లోని యదార్థాన్ని తన దృష్టితో తులనాత్మకం చేస్తున్నట్టుంది. మధ్య మధ్య ఎదురుగా గోడగడియారం వైపు చూపు తిప్పుతున్నాడు. దాన్లో ఆరున్నర. ఆస్టిన్‌లో ఉదయం ఎనిమిదవుతోంది.

"తిండి జాగ్రత్త విశ్వం. కాస్త 'నరిష్‌మెంట్' బాగుండేవి వండుకో. ఏవిటో ఈ చేయి కాల్చుకోవటం ఎన్నాళ్ళో?" అమ్మ నిస్పృహతో నిట్టూర్పు.

ఇప్పుడు చూపు నాపైన నిలిపాడు నాన్న. 'ఈ అవస్థలన్నీ ఇకచాల్లేగానీ, ఇక్కడికొచ్చేసెయ్. అటు పెళ్ళి సంబంధాల వాళ్ళకీ చెప్పలేక మా పనయిపోతోంది"

"అవున్రా. ఆవిడెవరో ధాన్యలక్ష్మి. నా ప్రాణం తినేస్తున్నది. ఫోన్ నెంబరెట్టా పట్టిందో ముందే వాట్సప్‌లో కూతురి ఫోటో పెట్టింది. పిల్ల నాజూగ్గా బాగుందిలే. సిఏ చేసిందిట. కూతురి తెలివితేటలూ, డెలాయిట్ ఉద్యోగం, ముప్పై లక్షల ప్యాకేజీ, సంగీత ప్రావీణ్యం – అన్నీ రాశి పోస్తోందావిడ."

"అవును. ఈ సంబంధం వాళ్ళ సంప్రదాయం, కుటుంబ వివరాలు బాగున్నై. ఇంకా ఒకటి రెండున్నాయి కూడా. వాటినీ చూడాలి. నువ్వోసారి వచ్చేస్తే బాగుంటుంది."

"అలాగే...అలాగే...లలిత బాగుంది కదా?"

అమ్మ ముఖకవళికలు మారినై."ఏం బాగుండటమో ఏమో.? దానిగదీ, ఉద్యోగం, అదీ.." గొంతు గదద్గికమవుతోంది.

కట్..కట్.. వీడియో బంద్. ఐప్యాడ్ పక్కకి పోయింది.

మనస్సు వెళ్ళగలిగినంత వెనక్కి వెళ్ళింది.

లలిత నాకంటే రెండేళ్ళు పెద్దది. కానీ, మేమిద్దరం సమవయస్కుల్లా పెరిగాం. అక్కా తమ్ముళ్ళ బంధంకంటే, స్నేహమే ఎక్కువ. ఇవ్వాళ లలితను తలచుకుంటే, అమ్మా నాన్నలకూ, నాకూ గుండె బిగిస్తుంది. ఆమె పెళ్ళి ఒక ఫెయిల్యూర్ స్టోరీ. ఇప్పుడు తానొక నిప్పుబొమ్మ. నమ్మి బతకటం ప్రేమ. నమ్మిస్తూ బతకటం ద్రోహం. ఆ ద్రోహానికే ఒడిగట్టారు – పరంధామయ్య, ఆయన భార్యా. నాన్నకు పరిచయస్థుడే. కొడుకు సుధాకర్ పెళ్ళికి నాన్నని శతధాపోరాడు. అంతా నమ్మబలికాడు. సుధాకర్ కూడా మంచివాడుగానే కనిపించాడు. పెళ్ళయింది.

ఢిల్లీలో లలిత కాపురం. అతను సాఫ్ట్‌వేర్‌వాడు. లలిత బిటెక్ కంప్యూటర్స్. ఏడాది తిరిగేసరికి నిజం తెలిసింది. సుధాకర్ పెద్ద 'రెక్'. 'బైపోలార్' జబ్బు. అదొక తిక్క పిచ్చి, 'స్ప్లిట్ పర్సనాలిటీ.' పెళ్ళికి ముందు నాలుగేళ్ళనుంచి ఇప్పటిదాకా వైద్యం. లలిత పరిస్థితి కంతానికి తడిగుడ్డ పిండి మెలిపెట్టినట్లయింది. మానసిక, దైహిక హింస. తప్పించుకుని పారిపోయి హైదరాబాద్ వచ్చేసింది. అన్నిరకాల భ్రాంతీ వదిలింది. ఆమె ఒంటరి విషాదం నలుగురి దుఃఖమైంది. శతకోటి పంచాయితీలూ, అనంతకోటి సవాళ్ళూ, ప్రతి సవాళ్ళూ – నిష్ఫల ముగింపునిచ్చాయి. చట్టం తనపని తాను చేసింది. లలిత డైవర్స్! అంతవరకూ నెత్తిన మోస్తూ వచ్చిన ప్రాణభయం గంపని తీసి విసిరేసింది. ఉద్యోగంలో చేరింది. ఇప్పుడు వర్క్‌ఫ్రం హోం. ఎవరు ఎప్పుడు పలకరించినా, పరామర్శించినా 'ఫైన్' అంటుంది. నాకు అది బోలు సమాధానమనీ, దాని మనసు వెలితి నవ్వు నవ్వుకుంటుందనీ తెలుసు.

ఇటు ఫోన్. మౌళి. సియాటెల్..టెల్...టెల్..

"ఎలా ఉన్నార్రా?"

"బాగున్నాం. ఏవిటీ నీ ఇండియా వెళ్ళే వ్యవహారం?"

"చెప్తాను... ప్రభావతి ఆరోగ్యం బావుందా?"

"ఫర్వాలేదు విశ్వం. ఆపరేషన్ అయి ఏడాది దాటినా ఇంకా అప్పుడప్పుడూ గుండెల్లో కొంత 'అనీజీ'గానే అనిపిస్తోంది"

"జాగ్రత్త మరి"

క్షణాలు మూగనోము పట్టాయి.

మాట పెగిల్చికొన్నట్టుంది. "మా ఫ్రెండ్ స్టీఫెన్ ఓసారి స్టీఫెన్ క్రేన్ గురించీ అతను రాసిన 'ది రెడ్ బ్యాడ్జ్ ఆఫ్ కరేజ్' కథ గురించి చెప్పాడురా. అందులో హెన్రీ అని కథానాయకుడు అంటాడుట – 'బతికుండటమే విజయం' అని. ఈ కాలపు మాలాంటి వాళ్ళ బతుక్కి సరిపోతుంది కదూ?!"

బాగా కోపమొచ్చింది.

"నోర్మూయ్‌రా. నీ పిరికిముందునీ, చెత్తవాగుడినీ ప్రభముందు పెట్టకు.."

నవ్వు. నవ్వులో స్వరం వణుకుతోంది. ఇదేమి నవ్వో!

'విశ్వం నువ్వు నా మాటల్లో భయాన్ని చూస్తున్నావురా. అదేం లేదు. నాకు లోకజ్ఞానం, వేదజ్ఞానం ఎక్కువని కితాబిచ్చావు కదా. మేము చేస్తున్న ప్రయాణం జ్ఞాతం నుండి అజ్ఞాతానికీ, వ్యక్తం నుండి అవ్యక్తానికీ అని నాకూ, ప్రభకూ కూడా తెలుసు."

"అమ్మో. నావల్ల కాదురా బాబూ. ఈ వేదాంతాన్ని భరించలేను" కొంచెం నాటకీయత కలిసింది.

నవ్వు. ఈ నవ్వు హాయిగా వుంది. హమ్మయ్య. ఊపిరాడుతోంది.

"అంతా మిథ్యేనని తెలుసు. అదీ మాయేనని తెలుసు. తెలిసీ వలచీ విలపించుటలో తీయదనం ఎవరికి తెలుసు" అన్నాడు సినీకవి. నాకు తెలిసింది కదా! ప్రభావతికి మైట్రల్‌వాల్వ్ సమస్య వుందని తెలుసుకదా, అయినా, ఆమె అన్ని వాస్తవాల్నీ తెలిపి నిష్కర్షగా పెళ్ళివద్దన్నా కూడా, నేను మనస్ఫూర్తిగా వలచి, ఇష్టపడి కావాలని ఆమెని ఒప్పించి మరీ పెళ్ళాడాను కదా! అందుకని నో 'ఫియర్!'

కాల్‌ని ముగించేశాడు. బహుశ ప్రభావతి గదిలోకి వచ్చి వుంటుంది.

ఈ మధ్య నా ఆదివారాలన్నీ ఇట్టాగే తెల్లవారుతున్నై.

మనసంతా చిక్కుపడిన దారపు వుండలా అయిపోతోంది. కొస అందటంలేదు. అందినా, చిక్కువిడటం లేదు.

మౌళీ, ప్రభావతీ, నేనూ హైస్కూల్ నుంచీ బిటెక్ దాకా సహాధ్యాయులం. ఆ తర్వాత ముగ్గురమూ యూ యస్ వచ్చి మూడు యూనివర్శిటీల్లో ఎం ఎస్ చేశాము. చదువులు పూర్తి అయి ఉద్యోగాల్లో చేరాము. మౌళీ ప్రభావతీ సియాటెల్. నేను ఆస్టిన్. మౌళి, ప్రభ ప్రేమించుకున్నారు. వీళ్ళు పెళ్ళి చేసుకోవటానికి అటువారు, ఇటువారూ కూడా సంతోషంగానే ఒప్పుకున్నారు. అక్కడే మలుపు. ఉన్నట్టుండి ప్రభావతి 'మైట్రల్‌వాల్వ్' దెబ్బతిన్నట్టు బయటపడింది. ఆమె ససేమిరా పెళ్ళికి

వొప్పుకోలేదు. "తుమ్మితే ఊడే ముక్కుతో సంసారమేమిటి మౌళీ. నన్నొదిలెయ్. ప్రేమ నిజమే. అది భ్రమ కాకూడదు. ఈ రెంటికి నడుమ ఆత్మతత్త్వం ఉంది. అది వివేకంతో ముడివడి వుండాలి" ఇదీ ఆమె వాదన.

మౌళి దేవదాసు కాలేదు గానీ, నిరాశకు లోనయ్యాడు. అమ్మానాన్నల బలవతంతో ఆమె ఇండియా వెళ్ళింది. మౌళి స్వభావంలోని సూక్ష్మతనీ, సున్నితత్వాన్నీ తెలిసినవాణ్ణి. ఉపదేశాల్లో నిష్కర్షా వుంది. అతన్నీ ఇండియా పంపాను. అక్కడే ప్రభకి ఆపరేషన్. ఆ తర్వాత ఆర్నెల్లకి పెళ్ళి. ఆమె ఒప్పుకున్నదనే కన్నా మౌళి వొప్పించాడనటమే సమంజసం. డాక్టర్ల సలహా పనిచేసింది.

ఐదారు నెలల తర్వాత – మౌళి అమెరికాకి తిరిగి వచ్చేశాడు. మరో ఆర్నెల్ల తర్వాత ఆమె కూడా వచ్చింది. మళ్ళీ ఉద్యోగాల్లో చేరారు. నేను సియాటెల్ వెళ్ళి ఓ వారం వుండి వచ్చాను. ఒకరోజు డిన్నర్ సమయంలో అన్నది ప్రభావతి, "మౌళివాదం, కోరిక, నిబద్ధత అన్నీ ఓకేగానీ – విశ్వం, 'జీవితం నలగటానికి కాదు వెలగటానికి' అన్న వో రచయిత్రి వాక్యం చదివి నాకు జ్ఞానోదయం అయింది,

– అదిగో, ఆమె ఆ రోజు అన్న ఆ వాక్యమే ఇవ్వాళ ఇరుసున బెట్టిన కందెనలా నన్ను ఘర్షిస్తోంది.

ఈ ఉదయం –

కళ్ళు నులుపుకుంటూ లేస్తుండగానే, 'ట్రింగ్...ట్రింగ్...' వీడియో.

మిస్ భారతి ఎం.ఏ, పి.హెచ్.డి, లెక్చరర్. ఈమె ఒక పట్టువదలని విక్రమార్కిణి నా మేనత్త కూతురు.

"హై... విస్సూ!" ఇదీ పలకరింపు.

"చెప్పు భారం..."

మూతి ముడుచుకుపోయింది. కనుకొసన కినుక. చెంపల మీద లేత కెంజాయ. ముఖం మాత్రం స్ఫాటిక స్వచ్ఛం.

"నీకు పిలుపులో నా భావుకత్వం ఎక్కువవుతోందిగానీ, ఇవ్వాళ చాలా మాట్లాడాల్సి వుంది. లేచి కూచో '

ఎలర్ట్! సరిగా కూచున్నాను. మాట్లాడాల్సి వుందంటే – వృత్తాంతాలూ, ఉపనిషత్ కథల వంటి సందేశాలూ నేపథ్య సంగీతాన్ని వినిపిస్తాయన్నమాట.

"అత్తయ్యా మామయ్యలకి చెప్పేవా?"

"ఎందుకు. నేనే వందసార్లు చెప్పాను కదా. నహీ చలేగా = 'నేను నిన్ను పెళ్ళి చేసుకోన ' అనీ, 'నన్ను వదిలెయ్' అనీ" చివరి పదాల్లో ఎంత బరువు కావాలో అంతా వత్తి పలికాను.

"నేను నూటయాభైసార్లు చెప్పాను – 'నిన్నొల్ల..నిన్నొల్ ' అని" "కొంతమంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు."

"చాల్లే వెటకారం.. నన్నొదిలెయ్"

"ఎందుకు వదిలెయ్యాలి? నీ వాలకం చూస్తుంటే 'బతుకంత భారమై, కన్నీటి ధారగా' అని శాలువా, బుడ్డీ, విషాదగీతం బాపతుగా తయారయ్యేట్టుంది. నానాటికి తీసికట్టుగా చిక్కిపోతున్నావ్ కూడా."

ఉలిక్కిపడ్డాను.

"అవును భారతీ. అమ్మకూడా పదే పదే ఇట్టాగే అంటోంది. నిజమేనా?"

"యస్. నిక్కంగా లోపల్లోపల ఏ రోగమన్నా ప్రబలుతున్నదేమో చూసుకో."

"అవును. అదీ నిజమేమో."

"ఏవిటా నిజం? చంపేస్తాను. తిక్కగా వుందా? ఇక్కడినుంచే గోడకుర్చీ వేయిస్తా జాగ్రత్త."

ప్రేమ ప్రకోపంలో భాష మారుతుంది. చనువు ముందు కొచ్చి సాన్నిహిత్యాన్ని కోరుతుంది.

"అవున్లే.. చిన్నప్పుడు ఎన్నిసార్లు నీ పాలబడి గోడ కుర్చీ వెయ్యలేదు గనుక"

పెదవులు విడివడని అలతి నవ్వు. చూడటానికి మురిపెంగా ఉంటుంది. 'ఎట్లాగైనా భారతి సౌందర్యవతి '

"చాల్లే ఫ్లాష్ బ్యాక్‌లూ, నోస్టాల్జియాలూ, ఇచ్చకపు మెచ్చుకోలు కబుర్లూ. అమ్మానాన్న దగ్గర మాత్రం నోరెత్తలేవు పిరిగొడ్డు."

"అదేంకాదు. నిర్ణయం నాదైనప్పుడు వారి ప్రమేయం ఏముంది? నా నిర్ణయమేమో. నేను ఏడాది నుంచీ చెబుతూనే ఉన్నాను."

మౌన సుందరి. మొహం మీద నిరుత్సాహం ఛాయ.

క్షణాలు కదిలాయి. నిదానంగా, నీరసంగ పెదవులు విడివడినై.

'చచ్చీచెడి మా అమ్మా నాన్న నోట 'సరే ' అనిపించుకోగలిగేనని సంతృప్తి పడుతుంటే, నీ దోబూచులాటతో నా ఓర్పుని పరీక్షిస్తున్నావ్?"

నాకు ఆశ్చర్యం. నిజంగానే ఇది కుందేటి కొమ్ము సాధనే.

ఆ మాటే అన్నాను. 'యూ ఆర్ గ్రేట్' భారతి మొహం చేటంతయింది.

"వాళ్ళ యక్ష ప్రశ్నలకు జవాబు చెప్పటం అంత సుళువేం కాదు. నీకూ తెలుసుగా? చచ్చీ చెడి సాధించాను."

అవును. నాకూ తెలుసు. అత్తా మామా నాన్నా అమ్మా.. రెండు జంటలూ కళ్ళల్లో స్ఫురణగా నిలిచారు. ఎప్పటిమాట? ఐదేళ్ళవుతుంది.

బిటెక్ అయింది . ఉద్యోగంలోనూ చేరాను.

అంటే, మరీ తెలుగువాళ్ళల్లో ఎలిజిబుల్ బ్యాచిలర్‌ని. అమ్మా నాన్నా పెళ్ళి ప్రసక్తి తెచ్చారు. భారతి గురించిన మాటలూ కలిశాయి. నేను సిగ్గుపడినట్టు అర్ధమైంది. అమ్మ ఇబ్బంది మొహం పెట్టి నన్ను ఉద్దేశించి చెప్పింది. "మీ అత్తయ్య వేరే కులం వాడితో లేచిపోయి పెళ్ళి చేసుకుంది. కొన్నాళ్ళకి మా ముందుకొచ్చింది .మీ నాన్నగారికీ వాళ్ళకీ చాలా ఘర్షణ

జరిగింది. 'నీ మొహం నాకు చూపకంటే, నీ మొహం నాకు చూపకని' ఇద్దరూ రెచ్చిపోయార్లే. అప్పట్నుంచీ సంబంధం తెగింది. అందుకని భారతితో పెళ్ళీ గిళ్ళీ ఆలోచన నీ మనసులోకి రానీకు."

నాన్నవైపు చూశాను. ఆయన మొహం కందగడ్డలా ఉంది. లేచి లోపలికి వెళ్ళిపోయాడు.

నా కళ్ళల్లో ఎందుకనో నీళ్ళు తిరిగాయి.

నాతో భారతి చనువు, ఆమె పట్ల నాకూ ఉన్న అభిమానం నన్ను ప్రశ్నించసాగాయి.

ఆ యేడాదే నేను అమెరికా వచ్చేశాను. ఆ ముందురోజున భారతి నేనూ కలిసి హోటల్లో డిన్నర్ చేశాము.

ఆప్యాయంగా నా చేతిని తన చేతిలోకి తీసుకుని, నా చూపులో చూపు నిలిపి, "వాళ్ళ పంతాలూ పట్టింపుల గురించి భయపడకు. నే చూసుకుంటా. ధైర్యంగా వుండు" అని బోధ చేసింది. 'వట్టి మెతక' అని సుతారంగా వో మొట్టికాయ వేసింది గడుసుపిండం కొంటెతనం.

కళ్ళు విదిలించుకుని నిదానంగా చూశాను. వర్ణనలకేం అందుతుంది. రవివర్మ దమయంతి యౌవన పరిమళం మత్తులో తేలిస్తుంటే, 'ఏయ్ తిండి సంగతి చూడు' అని భుజం పట్టుకుని గద్దింపు.

ఉజ్జ్వలమైన మాధుర్యభావన కాస్తా మెనూ కార్డుకి జారింది. భారతి కోకిల స్వరంలో కిలకిల. 'I exist because I think' అని తన మెసేజ్ పైన కొటేషన్ నిస్తూ వుంటుంది. ఒక్కొక్కప్పుడు 'I think because I exist' అంటుంది. రెండూ ఒకటే కదా అన్నానొకసారి. 'ఆలోచించు' అని ఊరుకుంది.

ఆలోచిస్తూనే వున్నాను.

ఒళ్ళు వేడెక్కినట్టుంది. భారతి రూపం అందం, మాటలూ విన్నాణం – సలుపుతూ వుంటాయి.

ఇంతలో కడుపులో గడబిడ. నులినొప్పి క్రమంగా అది పర్వతారోహణ చేస్తుంది. కన్నీళ్ళని ఉబికిస్తుంది. దేహాన్ని అతలాకుతలం చేస్తుంది.

పంటి బిగువ వలన ఏడుపు జలజల రాలదు.

గొంతులోకి నీళ్ళు కావాలి. నీళ్ళు పోసి ఆర్పాలి. తాగు సీసా ఖాళీ. లే..లే.. రష్.. రష్ టాబ్లెట్ పడిన పొట్టని చేత్తో పట్టుకుని మెలికలు తిరుగుతూ.. పరుగు ..పరుగు.

ఈజ్..ఈజ్ హమ్మయ్య! 'టాయ్‌లెట్' బయట పడేసరికి ఒళ్ళంతా చెమట. ఇందాకటి వేడి అంతా ఆవిరైపోయిందా? సలుపు కాస్తా చలువలు కమ్మించిందా?

పూర్ భారతీ ఇప్పుడూ చూస్తావా ఈ బావను? నీ బావను? నీ అనురాగ జ్యోత్స్నను ఈ అడివి బతుకు మీద ప్రసరిస్తావా?

నీరసం..కళ్ళు మూతలు పడుతున్నై.

కానీ, ఈ రోగం నిద్రపోనీయదు.

టైమెంత? పన్నెండూ ఇరవై.

ఇప్పటికి రెండుసార్లు. రిపీట్ పర్ఫామెన్స్.

జరిగిందేమిటో మరచిపోనీకుండా యాన్స్ మంట. మ్యూకస్ తడి.. తడి కడుపులో వికారం.

జరగబోయేదేమిటో  కూడా బాగానే తెలుసు. ఓ గంటలోపే – ఈ వికారం లుంగలు తిప్పి వాంతి మళ్ళీ పరుగు.. ఈసారి బ్లడీ. బ్లడీ స్టూల్.

బెడ్ మీద అతిమితంగా పొర్లటం. ఇది అంగారతల్పమా, శరతల్పమా? మెదడు ఘూర్ణిల్లుతున్నై. కనురెప్పల మీద అలసట, బరువు.

రోజులదేముంది దోసిట్లో నీళ్ళబాపతు. జారిపోతున్నై. నెల తిరిగింది.ఇవాళ, హఠాత్తుగా –

మౌళి ఫోన్. "ప్రభకి బాగాలేదు. హార్ట్‌లో మళ్ళీ ఏదో 'కరెక్షన్' అవసరమంటున్నారు ఇక్కడి డాక్టర్లు. ప్రభకి ఇక్కడ ఉండటం ఇష్టంలేదు. మేం ఇండియా వెళ్తున్నాం. అక్కడికి వెళ్ళి వైద్యం సంగతి తేలిన తర్వాత నీకు వివరాలు చెబుతాను."

నాకు మాట కట్టుబడింది .మనోమయ ప్రపంచం దిగంతాలకు విస్తరించుకుపోయింది. పరిపరి పరుగులు.

చాలాసేపటికి 'సరే, క్షేమంగా వెళ్ళిరండి' అనగలిగాను. ప్రభావతికి ధైర్యవచనాలూ, శుభాశంసలూ పలికాను.

వెన్ను చరుస్తున్న వాస్తవాల వలన మరింత వికారం. శక్తి పల్చనైపోతున్న భావన. అయినా, బలీయమైన కోరిక భారతికి ఫోన్ చేయించింది.

– అంతా విని,

'ఏ ప్రయత్నమైనా చేయగల సామర్థ్యం మేధకే ఉన్నది. ఏం ఫర్వాలేదు. వాళ్ళిద్దరితో నేనూ మాట్లాడతాను. వాళ్ళను కలుస్తాను. నేనుగా చేయవలసినది తప్పకుండా చేస్తాను. ఇట్స్‌మై డ్యూటీ. డోంట్ వర్రీ" భరోసా ఇచ్చింది. తెలిసీ తెలియని అధైర్యంతో ముడుచుకుపోవటం తాత్కాలికంగా ఆగింది.

ఇది జరిగి నిండా పదిరోజులు గడవకముందే భారతి నుంచీ విషాదవార్త. 'ప్రభావతి ఆపరేషన్ టేబుల్‌మీదే అంతిమ శ్వాస వదిలింది. మౌళి దుఃఖాన్ని చూడలేం..'

ఇంత హఠాత్పరిణామానానికి నా 'బవల్స్  తట్టుకోలేవు. 'కడుపు'కోత – దైహికంగా, మానసికంగా.

ఆరోజునుంచీ వారం రోజులు నరకాన్నే చూసాను. చిన్న ప్రేగుల్లో బాధ. ఆక్టోపస్ అది కదులుతున్నట్టూ వుంటుంది, కదలదు. చిత్రమైన జలచరం.

భారతి పదే పదే ఫోను. ముక్తసరిగా మాటలు.

'కాల రథప్రచారమొక ఖండనిమేషమునాగబోదు..' దువ్వూరి రామిరెడ్డిగారి పద్యం. లోలోపల హమ్మింగ్.

ఇవాళ, 'వర్క్‌ఫ్రం హోం'లో తీవ్రమైన ఒత్తిడి. క్షణం తీరికలేదు. ఎమోషనల్ తిండి తింటూ, పనిచేస్తూ మధ్య మధ్య నా ఆరోగ్య సమస్యకు సమాధానం చెప్పుకుంటూ రాత్రి దాకా బండిని లాక్కొచ్చాను.

ఇప్పుడు అమ్మానాన్నా సన్నివేశంలోకి ప్రవేశించారు. మాములు పెళ్ళి ఘోష. "ఘోటకపు బ్రహ్మచారిగా మిగులుతావాయేం?" అని గద్దింపూ, మందలింపూ. చివరికి "నువ్ సెలవు పెట్టి వచ్చేయాల్సిందే" అని హెచ్చరిక.

దినచర్యని ఆపి కూచున్నాను. మనసులో అనేక ఉలికిపాటుల పరంపర.

పెళ్ళి – అనారోగ్యం. జీవితం రోగాల ప్రభావం.

లలిత గుర్తుకొచ్చింది. తనకున్న రోగాన్ని చెప్పకుండా పెళ్ళి చేసుకుని, ఆమె బతుకును బండలు చేసిన సుధాకర్. అది నమ్మక ద్రోహం. ఇటు ప్రభావతి తన గుండె జబ్బు గురించి చెప్పినా ప్రేమదే పై చేయి చేసి ఆమెను పెళ్ళాడిన మౌళి. ఇవ్వాళ అతనొక దుఃఖ సంపుటం. ఇది నమ్మకం ఫలితం.

కేస్ ఫైల్‌తీసి నా రోగం 'ప్రోగ్నాసిస్' గురించి పునశ్చరణ చేసుకున్నాను. డాక్టర్ల సలహా. మందులు వాడితే పరిణామం, వాడకపోతే పర్యవసాన వివరంగానే ఇచ్చారు.

మళ్ళీ మళ్ళీ చదువుకున్నాను. శత్రువు ముందుకు కదులుతున్నది. నా పరిస్థితి నాకు అర్ధమవుతూనే వుంది.

నాకు అర్ధమవుతున్న పరిస్థితిని భారతికి స్పష్టం చేయవలసిన సమయం వచ్చింది. ఆమెతోపాటు అమ్మా నాన్నకూ చెప్పేయాలి, ఈ 'పెళ్ళి' సందిగ్దానికి తెరదించాలి. వివేకం బాధ్యతనూ ముందుకు నెట్టింది. ఈ స్థితిలో దాని ఏలుబడికి తలవొగ్గక తప్పదు హైదరాబాద్‌కి టికెట్స్ బుక్ చేసుకున్నాను, బెడ్ మీద ఒరిగాను పడుకుంటే నిద్రరాదు దొర్లుతున్నాను.

***

హైదరాబాద్ –

పరామర్శలూ, జెట్‌ల్యాగ్ ముగిసినై.

రెండురోజుల తర్వాత నా మెడికల్ ఫైల్‌ని ముందు భారతికీ, ఆ రాత్రే మా నాన్నకూ అందించాను.

చేష్టలు దక్కిన ప్రతిస్పందనలు.

నీరసం, నిరీహ, అందరి మనసుల్లో ఆందోళన, ప్రశ్నలూ.. మూగవోయిన సమాధానాలూ.

పదిహేను రోజులు ఇట్టే గడిచిపోయాయి.

ఈరోజు ఇప్పుడు,రాత్రి పదిగంటలు.

భారతి, నేనూ ట్రైడెంట్ 'ది అమర 'లో . పేరుకు తగ్గట్టే వుంది యాంబియన్స్.

ఉన్నట్టుండి 'నేనో నిర్ణయానికొచ్చాను' అన్నది భారతి. ఆ మాటకి కొనసాగింపుగా – "నువ్ పర్మనెంట్‌గా ఇక్కడే వుండిపోతున్నావ్. ఏడాది తర్వాత మనం పెళ్ళి చేసుకుంటాం" చెప్పింది.

కోపమొచ్చింది. తలెత్తి చూశాను. "జోకులాపు. ఫూలిష్ ఫెలో. నేను బాధపడటమేమోగానీ, నా బాధతో నువ్ ఛస్తావ్"

"ఏంకాదు. మా డాక్టర్ శర్మగారు నీ రోగాన్ని తగ్గించే నేచురల్ మార్గం చెప్పారు. నేను నీ రోగం కుదురుస్తాను."

నర్మగర్భంగా పెదవి దాటని నవ్వు.

భారతి కళ్ళల్లోకి తీక్షణంగా చూస్తూ "ఏవిటీ.. అడ్వాన్స్‌డ్ క్రోన్స్ డిసీజ్‌ని నువ్వు నయం చేస్తావూ" హేళనగా ఫెళ్ళున నవ్వాను.

"అవును" అని రెట్టించి, నా చేతిని తన చేతిలోకి తీసుకుంది. కళ్ళు చికిలిస్తూ నా చూపులో తన చూపు నిలిపింది. ఆ మౌన లిపి ప్రసరణం, ఆమె చేతి స్పర్శ వెట్టతనం కంటే రాగరంజితంగా ఉంది.

ప్రతి సమస్యకీ ఓ పరిష్కారం అన్నారు, ప్రతిరోగానికీ ఓ చికిత్స వున్నదా? అయినా, పరిష్కారాలూ, చికిత్సలూ శాశ్వతమా, తాత్కాలికమా? అసలు జీవితం సంగతేమిటి? ఏమో మరి? నా నిర్ణయం మాత్రం ఆద్యంతాల మధ్య ఊగులాట. I exist because I think!!

COMMENTS